క్లుప్తంగా

కాపు విద్యాభవన్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయం



కృష్ణలంక(విజయవాడతూర్పు): పేద కాపు కుటుంబంలోని బాలబాలికలను ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దే బృహత్ సంకల్పంతో రాష్ట్రంలోని ప్రతి పార్లమెంటు కేంద్రంలో కాపు విద్యాభవన్‌లు ఏర్పాటు చేయడం అభినందనీయమని విజయవాడ తూర్పు, తాడేపల్లిగూడెం ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్, బొలిశెట్టి శ్రీనివాస్ అన్నారు. కాపునాడు ఫౌండేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేస్తున్న కాపు విద్యాభవన్‌ల ప్రారంభోత్సవ కార్యక్రమం ఆదివారం గవర్నర్‌పేటలోని ఎం.బి.విజ్ఞాన కేంద్రంలో జరిగింది. ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యేలు గద్దె, బొలిశెట్టి పాల్గొని జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం వారు మాట్లాడుతూ కాపు సామాజిక వర్గంతో పాటు ఆర్థిక ఇబ్బందులతో విద్యకు దూరమైన ఇతర కులాల పేద విద్యార్థులను కూడా ఆదుకోవాలని సూచించారు. తొలుత ఈ కార్యక్రమంలో భాగంగా బాలికల కోసం కృష్ణలంక, ఫీడర్‌రోడ్డులోని ఎస్‌బీఐ బిల్డింగ్‌పైన ఏర్పాటు చేసిన కాపు విద్యాభవన్–1ను ఎమ్మెల్యే గద్దె ప్రారంభించారు. కార్యక్రమంలో కాపునాడు జాతీయ అధ్యక్షుడు గాళ్ల సుబ్రహ్మణ్యం, రాష్ట్ర అధ్యక్షుడు అర్జా రామకృష్ణ, కాపునాడు సిద్ధాంతకర్త లక్కినేని ప్రసాద్, ఫౌండేషన్ సలహామండలి సభ్యులు పాల్గొన్నారు.

నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ



మధురానగర్(విజయవాడసెంట్రల్): విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకుని జీవితంలో ఉన్నత స్థానాలకు చేరుకోవాలని ప్రముఖ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర రావు సూచించారు. స్థానిక బీఆర్‌టీఎస్ రోడ్డులోని హెల్పింగ్ టు గెదర్ 2009 గ్రూప్ ఛారిటబుల్ ట్రస్ట్ కార్యాలయంలో ఆదివారం నిరుపేద విద్యార్థులకు నోట్ పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని విద్యార్థులకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వర రావు మాట్లాడుతూ నిరుపేద విద్యార్థులను గుర్తించి వారికి ఉచితంగా నోట్ పుస్తకాలు అందజేస్తున్న ట్రస్ట్ సభ్యులను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకుని సేవలు అందించాలని సూచించారు. వాకర్స్ క్లబ్ డెప్యూటీ గవర్నర్ డాక్టర్ బ్రహ్మదేశం వసంత కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ తోచినంతలో సేవా కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. విద్యతోనే సమగ్ర అభివృద్ధి సాధ్యమని అన్నారు. అనంతరం నిరుపేదలకు పుస్తకాలు, స్టేషనరీ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు కోరంగి నాగ మల్లిక, షేక్ షఫీవుల్లా, హిరణ్య, త్రినాథ్, రత్నప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

'దుర్గా' డిపాజిట్లు చెల్లించేలా చర్యలు తీసుకోవాలి



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ వన్‌టౌన్‌లోని దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్‌లో డిపాజిట్ చేసిన సొమ్మును తక్షణమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలని డిపాజిట్‌దారులు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్, జిల్లా సహకార బ్యాంక్ రిజిస్ట్రార్‌కు మెమరాండం సమర్పించాలని బాధితులు నిర్ణయించారు. పశ్చిమ నియోజకవర్గంలోని కేదారేశ్వరపేటలో గల ఒక పాఠశాలలో ఆదివారం బాధిత డిపాజిట్‌దార్ల సమావేశం జరిగింది. పి.స్వామి చరణ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ తొమ్మిది దశాబ్దాలకుపైగా చరిత్ర కలిగిన దుర్గా కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కోట్లాది రూపాయల డిపాజిట్లను సేకరించిన బ్యాంక్ పాలకవర్గం దానిని దివాలా దిశగా తీసుకువెళ్లిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గత రెండేళ్లుగా డిపాజిట్ల కాలపరిమితి ముగిసినా తిరిగి చెల్లించకుండా ఆర్‌బీఐ నిబంధనల పేరుతో కాలయాపన చేయటం దుర్మార్గమన్నారు. గత రెండేళ్ల నుంచి వసూలు చేసిన మొండి బకాయిల నుంచి అయినా తమ డిపాజిట్లు చెల్లించాలని కోరారు. డిపాజిట్‌దారులలో అత్యధిక శాతం మంది వృద్ధులు, వితంతువులు, రిటైరైన ఉద్యోగులు ఉన్నారని, వారు వైద్యం చేయించేకునేందుకుకూడా డబ్బులు లేక నానా అవస్థలు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే పిల్లల పెళ్లిళ్ల కోసం డిపాజిట్ చేసిన సొమ్ము తిరిగి ఇవ్వకపోవడంతో వారు తీవ్ర ఆందోళన చెందుతున్నామని తెలిపారు. వృద్ధాప్యంతో పాటు మానసికంగా కూడా ఆరోగ్యం దెబ్బతినే పరిస్థితికి తీసుకువచ్చిన బ్యాంక్ పాలకవర్గం చర్యలు అత్యంత బాధాకరమని పేర్కొన్నారు.









ఇంద్రకీలాద్రిపై దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో ఆషాఢ మాసోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ఆదివారం పెద్ద సంఖ్యలో భక్తులు ఇంద్రకీలాద్రికి తరలివచ్చి భక్తిశ్రద్ధలతో అమ్మవారికి సారెను సమర్పించారు. ఉదయం నుంచి రాత్రి వరకు భక్తుల రద్దీ కొనసాగింది. భక్తులతో దుర్గా ఘాట్, కనకదుర్గా నగర్, కొండపై కోలాహలం నెలకొంది. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ





భక్తిశ్రద్ధలతో సారె సమర్పణ







ఉచిత వైద్యసేవలు సద్వినియోగం చేసుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిరుపేదలకు సైతం కార్పొరేట్ వైద్యం అందించాలనే సదుద్దేశంతో తాము ఏర్పాటు చేసిన ఉచిత వైద్య సేవలను సద్వినియోగం చేసుకోవాలని కుందా హాస్పిటల్ ఛైర్మన్ డాక్టర్ కుందా శ్రీధర్ అన్నారు. స్థానిక సత్యనారాయణపురం జీఎస్ రాజు రోడ్డులోని కుందా హాస్పిటల్‌లో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య విషయాలపై అవగాహన పెంచుకోవడంతో పాటు క్రమం తప్పకుండా వైద్యపరీక్షలు చేయించుకోవాలని సూచించారు. తాము అతి ఖరీదైన పరీక్షలు సైతం ఇక్కడ ఉచితంగా చేస్తున్నామని తెలిపారు. ప్రముఖ వైద్యుడు డాక్టర్ సందీప్‌కుమార్ మాట్లాడుతూ వాతావరణం మారిన నేపథ్యంలో డెంగీ, టైఫాయిడ్ వంటి వ్యాధులు పెరిగే అవకాశం ఉందన్నారు. కావున దోమల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఏ అనారోగ్య సమస్య తలెత్తినా నిర్లక్ష్యం చేయకుండా సమీపంలోని వైద్యులను సంప్రదించాలని సూచించారు. అలాగే కాచి చల్లార్చిన నీటినే తాగాలని, ఇష్టారాజ్యంగా మందులు వాడకుండా వైద్యుల సలహా మేరకు చికిత్స తీసుకోవాలని సూచించారు. అనంతరం ఈసీజీ, బీఎండీ ఎముకల పరీక్ష, కొలెస్ట్రాల్, థైరాయిడ్, కిడ్నీ, లివర్, సీబీపీ తదితర పరీక్షలు ఉచితంగా చేశారు. కార్యక్రమంలో ప్రముఖ దంత వైద్యురాలు డాక్టర్ కుందా వీఎల్ శైలజ, సిబ్బంది పాల్గొని వైద్యపరీక్షలు నిర్వహించారు.



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కుందా శ్రీధర్, డాక్టర్ సందీప్‌కుమార్

ప్రమాదకరంగా మలుపు

మధురానగర్(విజయవాడసెంట్రల్): నిత్యం రద్దీగా ఉండే మధురానగర్ పైపుల కంపెనీ సెంటర్ శ్రీషిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలోని రోడ్డు మలుపు ప్రమాదకరంగా మారింది. ఇటీవల వర్షాలకు ఇక్కడ రోడ్డు కృంగిపోయింది. దీంతో తరచూ ప్రమాదాలు జరుగుతుండటంతో స్థానికులు చెట్ల కొమ్మలు అడ్డుగా పెట్టారు. అలాగే ఇక్కడ పైపులైన్ల లీకేజీల వల్ల రోడ్డు పాడయ్యి గోతులు పడ్డాయి. దీంతో ఈ రోడ్డులో ప్రయాణం చేయాలంటేనే హడలిపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డును సరి చేయాలని స్థానికులు కోరుతున్నారు.

ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలో...

31వ డివిజన్ ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని యూవీ నరసరాజు రోడ్డు మలుపులో కూడా రోడ్డు పాడయ్యింది. దీంతో ఇక్కడ వర్షపునీరు నిలిచిపోయి పరిసరాలు అపరిశుభ్రంగా మారుతున్నాయి. ఇక్కడ రోడ్డును సరిచేయడంతో పాటు వర్షపునీరు నిల్వ ఉండకుండా బయటకు పోయే చర్యలు చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు.



మధురానగర్ షిర్డీ సాయిబాబా ఆలయం సమీపంలోని రోడ్డు మలుపులో చెట్ల కొమ్మలు పెట్టిన దృశ్యం



ప్రభుత్వ ముద్రణాలయం సమీపంలోని యూవీ నరసరాజు రోడ్డుపై నిలిచిపోయిన వర్షపునీరు

మధురంగా సాగిన సినీ సంగీత విభావరి

విజయవాడ కల్చరల్: రాగసుధామయి క్రియేషన్స్ ఆధ్వర్యాన గాంధీనగర్‌లోని హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించిన రాగాల పల్లకీ–5 సినీ సంగీత విభావరి మధురంగా సాగింది. నిర్వాహకుడు ఫిరంగి రవి కుమార్ ఆధ్వర్యంలో నిమ్మగడ్డ శేఖర్ వాఖ్యానంతో ఘంటసాల, పీ సుశీల, ఎస్పీ బాల సుబ్రహ్మణ్యం, ఏసుదాసు, చిత్ర తదితరులు గానం చేసిన గీతాలను ఆలపించారు. కార్యక్రమంలో గాయనీ గాయకులు భాస్కర్, లెనిన్, అర్జున్, జగదీష్, శ్రీవల్లి, మోహన లక్ష్మి, రమణ, పెద్దిరెడ్డి, లక్ష్మి కందుల, నిషిత, శారదశ్రీ పాల్గొన్నారు.

కొత్తా పూర్ణానందం కళా వేదికమీద..

భీమవరానికి చెందిన చిప్పాడ నాగేశ్వరరావు ఆధ్వర్యంలో కొత్తా పూర్ణానందం కళా వేదికమీద ఎన్టీఆర్‌కు స్వరాంజలి పేరుతో ఘంటసాల వెంకటేశ్వరరావు గానం చేసిన గీతాలను నాగేశ్వరరావు, నిర్మల ఆలపించారు. గాయకుడు శ్యాంప్రసాద్, తటవర్తి సూర్యనారాయణ గాయనీ గాయకులను అభినందిస్తూ ప్రసంగించారు.



హనుమంతరాయ గ్రంథాలయంలో సినీ గీతాలను ఆలపిస్తున్న రవికుమార్ బృందం

జువైనల్స్‌కు కౌన్సిలింగ్

పాయకాపురం(విజయవాడరూరల్): వాంబే కాలనీ సి బ్లాక్ గ్రౌండ్‌లో ఆదివారం జువైనల్స్‌కు నున్న పోలీసుస్టేషన్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా నున్న సిఐ ఎన్.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ చెడు నడత కలిగి ప్రవర్తిస్తున్న వారిపై ప్రత్యేక దృష్టి పెట్టామని, అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే సహించేది లేదని హెచ్చరించారు. చెడు ప్రవర్తన కలిగిన వారితో ఎటువంటి సంబంధాలు పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఎస్‌ఐలు ఎన్ విమల, ఎస్ నాగేశ్వరరావు, సిబ్బంది, సచివాలయ మహిళ పోలీస్ సంరక్షకులు పాల్గొన్నారు.

ఆటో ఢీ కొని ఇరువురికి గాయాలు

పాయకాపురం(విజయవాడ రూరల్): నున్న మ్యాంగో మార్కెట్ వద్ద శనివారం రాత్రి ఆటో ఢీ కొన్న సంఘటనలో ఇద్దరు వ్యక్తులకు గాయాలు అవడంతో పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. నున్న పోలీసులు తెలిపిన వివరాలు.. ముఠా పనిచేసే వాకా పాండు, సాయి రంగయ్యతో కలిసి నున్న మ్యాంగో మార్కెట్ వైపు బైక్‌పై వెళ్తుండగా కండ్రిక సెంటర్ వద్ద ఆటో ఢీ కొట్టింది. ప్రమాదంలో పాండు, సాయి రంగయ్యకు గాయాలు అయ్యాయి. బాధితుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

12వ శతాబ్దపు నార్నెపాడు శాసనాన్ని కాపాడుకోవాలి

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం నార్నెపాడులోని భీమేశ్వరాలయం బయట పడి ఉన్న క్రీస్తు శకం 12వ శతాబ్దానికి చెందిన శాసనాన్ని పరిరక్షించాలని పురావస్తు పరిశోధకుడు, ది కల్చరల్ సెంటర్ ఆఫ్ విజయవాడ అండ్ అమరావతి(సీసీవీఏ), ప్లీచ్ ఇండియా ఫౌండేషన్ సీఈఓ డాక్టర్ ఈమని శివనాగిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎన్టీఆర్ జిల్లా విజయవాడ మధుచౌక్‌లోని సీసీవీఏ కార్యాలయంలో ఆయన ఆదివారం విలేకరులతో మాట్లాడారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించడానికి సీసీవీఏ ఆధ్వర్యంలో చేపట్టిన ప్రత్యేక కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లాలోని భీమేశ్వరాలయం పరిసరాలను ఆదివారం పరిశీలించామన్నారు. ఆలయం ఆవరణలో ఉండే 12వ శతాబ్దానికి చెందిన ఎంతో విలువైన ఈ శాసన రాయిని ఆలయ పునర్నిర్మాణ సమయంలో రోడ్డుపై పడేశారని పేర్కొన్నారు. శాసన రాయిపై క్రీస్తు శకం 1151 నాటివి రెండు, క్రీస్తు శకం 1198 నాటి ఒకటి, క్రీస్తు శకం 12వ శతాబ్దానికి చెందిన రెండు, క్రీస్తు శకం 1266 నాటి ఒకటి కలిపి మొత్తం ఆరు శాసనాలున్నాయని శివనాగిరెడ్డి వివరించారు.

చారిత్రక సంపదను కాపాడాలి..

ఈ శాసనాల్లో సోమేశ్వరాలయంలోని కేశవస్వామి అఖండ దీపాలకు దానం చేసిన వారి వివరాలు, ఆలయం ఆవరణలో నంది విగ్రహాలను ప్రతిష్ఠించిన వారి వివరాలు, చెరువును తవ్వించిన వివరాలు ఈ శాసనాల్లో ఉన్నాయని శివనాగిరెడ్డి పేర్కొన్నారు. ఈ శాసనాల చారిత్రక విలువపై ఆ గ్రామస్తులకు అవగాహన కల్పించామన్నారు. సుమారు 800 ఏళ్ల నాటి ఈ శాసనాలను ఆలయం ఆవరణలోనే ప్రత్యేకంగా పీఠం ఏర్పాటు చేసి శాసనంపై ఉన్న వివరాలు అందరికీ తెలిసేలా ప్రభుత్వం ఏర్పాటు చేయాలని కోరారు. చారిత్రక సంపదను కాపాడి భవిష్యత్తు తరాలకు అందించడానికి అవసరమైన సహాయాన్ని అందించడానికి తాను ఎల్లప్పుడు సిద్ధంగా ఉంటానని చెప్పారు. మణిమేల శివశంకర్, స్వర్ణ చినరామిరెడ్డి తనకు సహకరించారని శివనాగిరెడ్డి పేర్కొన్నారు.



శాసనాలను పరిశీలిస్తున్న పురావస్తుశాస్త్ర పరిశోధకుడు ఈమని శివనాగిరెడ్డి

ఘనంగా ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం

పాయకాపురం(విజయవాడరూరల్): ఎమ్మార్పీఎస్ 30వ ఆవిర్భావ దినోత్సవాన్ని సెంట్రల్ నియోజకవర్గంలోని పలు సెంటర్లలో ఆదివారం ఎమ్మార్పీఎస్ నాయకులు ఘనంగా నిర్వహించారు. ఏపీఎస్ రెడ్డి రోడ్డు, ప్రకాష్‌నగర్, మూడు బొమ్మల సెంటర్లలో ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవం, మంద కృష్ణ మాదిగ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని జెండాలను ఆవిష్కరించారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో రాష్ట్ర నాయకులు కాంపటి వెంకటేశ్వరరావు మాదిగ, నూకపోవేసు మాదిగ, లింగాల నరసింహులు మాదిగ, వీహెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షురాలు గంటేడి సుజాత నాయుడు, సురవరపు రాంబాబు మాదిగ, వంకాయలపాటి అబ్రహాం మాదిగ, చప్పిడి కాశీ మాదిగ, కార్యకర్తలు పాల్గొన్నారు.



ఏపీఎస్ రెడ్డి రోడ్డులో ఆవిర్భావ దినోత్సవం

నేడు ప్రజా ఫిర్యాదులు, పరిష్కార వేదిక కార్యక్రమం

పటమట(విజయవాడతూర్పు): వీఎంసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ప్రజా ఫిర్యాదులు, పరిష్కార వేదిక కార్యక్రమంలో నగర వాసులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకువచ్చి పరిష్కరించుకోవాలని వీఎంసీ ఇన్‌చార్జి కమిషనర్ డాక్టర్ మహేష్ తెలిపారు. ప్రతి సోమవారం ఉదయం 10 గంటలకు విజయవాడ నగరపాలక సంస్థ ప్రధాన, జోనల్ కార్యాలయాల్లో కార్యక్రమం జరు గుతుందన్నారు. నగర వాసులు ఆయా ప్రాంతాల్లోని కార్యాలయాల్లోని అధికారులకు తమ ఫిర్యాదులను అందజేసి, పరిష్కరించుకోవాలని సూచించారు.

లయన్స్‌క్లబ్ కార్యవర్గ ప్రమాణ స్వీకారం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): లయన్స్ క్లబ్ విజయవాడ ఈస్ట్ అధ్యక్షుడిగా బోడేపూడి హనుమయ్య, కార్యదర్శిగా రఘురామ శర్మ, కోశాధికారిగా బెల్లాని రమేష్ బాధ్యతలు చేపట్టారు. నూతన కార్యవర్గం చేత లయన్ మిరియాల వెంకటేశ్వరరావు ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ లయన్స్ క్లబ్ విజయవాడ ఈస్ట్ ఆధ్వర్యంలో అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. వైద్య, రక్తదాన శిబిరాలు నిర్వహించామన్నారు. దీర్ఘకాలిక వ్యాధులపై అవగాహన సదస్సులు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మానసిక వైద్యుడు ఇండ్ల రామసుబ్బారెడ్డి, లయన్స్ క్లబ్ విజయవాడ ఈస్ట్ ప్రతినిధులు పాల్గొన్నారు.

సమాజ సేవ సామాజిక బాధ్యతగా భావించాలి

భవానీపురం(విజయవాడపశ్చిమ): సమాజ సేవను ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా భావించాలని, పేద కుటుంబాలకు చేయూతనిస్తూ వారి ఎదుగుదలకు కృషి చేయాలని మల్టిపుల్ కౌన్సిల్ ఛైర్‌పర్సన్ డిస్ట్రిక్ట్ 316 లయన్ దామర్ల శ్రీశాంతి పేర్కొన్నారు. విజయవాడ లయన్స్ క్లబ్ మెడికల్ నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకార కార్యక్రమం భవానీపురం శివాలయం సెంటర్‌లోని ఒక ఫంక్షన్ హాల్‌లో ఆదివారం సాయంత్రం జరిగింది. లయన్ తటవర్తి దుర్గామల్లేశ్వరరావు పాల్గొని నూతన కార్యవర్గ సభ్యులతో ప్రమాణం చేయించారు. నూతన అధ్యక్షుడిగా పైడిమర్రి వేణుగోపాలరావు, కార్యదర్శిగా పువ్వాడ లక్ష్మీ శ్రీనివాసరావు, కోశాధికారిగా గుర్రం లక్ష్మీనారాయణతో పాటు 40 మందిని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన శ్రీశాంతి మాట్లాడుతూ.. పేదలకు విద్య, వైద్య సేవలను అందించడంతోపాటు రానున్న దసరా ఉత్సవాలకు వివిధ ప్రాంతాల నుంచి వచ్చే భక్తులకు ఉచిత వైద్య సేవలు అందించాలని సూచించారు. ఈ సందర్భంగా నలుగురు విద్యార్థులకు ఉపకార వేతనాలు, ఒకరికి వాటర్ ఫిల్టర్, జీవకారుణ్య ఆశ్రమానికి రూ.10 వేలు విలువైన ఆహారాన్ని అందజేశారు. డిస్ట్రిక్ట్ ఫస్ట్ వైస్ గవర్నర్ వీవీపీ ఆంజనేయులు, డాక్టర్ కోలా విజయశేఖర్, విద్యాధరరావు, సురేష్ బాబు, వై సుబ్బారావు, టీ వాసుదేవ గుప్తా, సామా వెంకట సత్యనారాయణ, సీసీ కేశవరావు పాల్గొన్నారు.

గొప్ప దేశ భక్తుడు కళా వెంకటరావు



కళా వెంకటరావు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దృశ్యం

మధురానగర్(విజయవాడసెంట్రల్): ఉమ్మడి మద్రాసు రాష్ట్ర రెవిన్యూ మంత్రిగా కళా వెంకటరావు చేసిన సేవలు ఎనలేనివని, ఆయన గొప్ప దేశ భక్తుడు అని మాజీ డెప్యూటీ మేయర్ సామంతపూడి నరసరాజు కొనియాడారు. స్థానిక ముత్యాలంపాడు శ్రీ అల్లూరి సీతారామరాజు శాఖా గ్రంథాలయంలో ఆదివారం ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు, ఉమ్మడి మద్రాసు రాష్ట్ర రెవిన్యూ మంత్రి కళా వెంకటరావు 125వ జయంతి కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని కళా వెంకటరావు చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కళా వెంకటరావు చురుకైన పాత్ర పోషించారని పేర్కొన్నారు. గ్రంథాలయ అధ్యక్ష, కార్యదర్శులు కే సుబ్బరాజు, పీవీ సుబ్బరాజు మాట్లాడుతూ ముత్యాలంపాడు శ్రీఅల్లూరి సీతారామరాజు శాఖా గ్రంథాల యంను 1948లో అప్పటి ఉమ్మడి మద్రాసు రాష్ట్ర రెవిన్యూ మంత్రి కళా వెంకటరావు చేతుల మీదుగా ప్రారంభించడం జరిగిందని తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి శ్రీనివాసరాజు, అల్లూరి సీతారామ రాజు సాంస్కృతిక సంఘం అధ్యక్ష, కార్యదర్శులు ఎస్ వెంకటేశ్వరరాజు, కేఎస్ ప్రసాదరాజు, కోశాధికారి డీజేపీఎస్ రాజు, కార్యవర్గ సభ్యులు భాస్కరరాజు, డాక్టర్ ఎస్వీ సుబ్బరాజు, వెంకమరాజు, పీ సీతారామరాజు, డీ మురళీకృష్ణంరాజు తదితరులు పాల్గొని కళా వెంకటరావుకు నివాళులర్పించారు.